Digital, tmedia.net.in

# టీ-మీడియా

నిజం మా లక్ష్యం... ప్రజలే మా శక్తి...
TMEDIA
11వ వార్షికోత్సవం
2016 - 2026
మీ ఆదరణ... మా ప్రేరణ... ధన్యవాదాలు!

tmedia.net.in
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక :336
పేజీలు : 5

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

గురువారం ఆగస్టు 06, 2026 టీమీడియా మెయిన్ ఎడిషన్ ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## పోలీసు చర్యపై అమిత్ షా సమాధానం చెప్పాలి

**● పార్లమెంట్ వద్ద విపక్ష ఎంపీల నిరసన**

**టి మీడియా , ఆగస్టు 5 , ఢిల్లీ బ్యూరో :**
విద్యార్థుల నిరసనపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ప్రతిపక్ష పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. జులై 20న జరిగిన విద్యార్థుల ఆందోళనలో లాఠీచార్జ్, పెల్లెట్ గన్స్ వినియోగం జరిగిందన్న ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్?లో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా సహా పలువురు ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన చేపట్టారు.




దిల్లీలోని ప్రేరణా స్థల్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం నుంచి మకర్ ద్వార్ వరకు మార్చ్ నిర్వహించారు. విద్యార్థులపై పోలీసుల చర్యతో పాటు అయోధ్య రామ మందిర విరాళాల నిధుల వ్యవహారం వంటి అంశాలపై కూడా ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి.

# హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీ

## అనుమతుల కోసం ప్రైవేట్ కళాశాలల అడ్డదారులు

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంతకం ఫోర్జరీకి గురైంది. పలు ప్రైవేట్ ఇంటర్ కళాశాలలు అక్రమంగా ఫైర్ ఎన్వోసీలు పొందేందుకు ఆయన సంతకం ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. పలువురు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే 8 ప్రైవేట్ కాలేజీలు ఇంటర్?బోర్డుకు ఫైర్ ఎన్వోసీలు సమర్పించినట్లు వెల్లడైంది. ఆయా కళాశాలల గుర్తింపును రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు అధికారులు మంగళవారం ఫిర్యాదు చేశారు. హైడ్రా అదనపు డైరెక్టర్ ఫిర్యాదుతో లేక్ ఠాణాలో పోలీసులు కేసు నమోదు చేశారు. మరో 60 కాలేజీల ఎన్వోసీలను కూడా పరిశీలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.
ఫోర్జరీ ఎన్వోసీలు పొందిన కాలేజీలివే
హైదరాబాద్‌లో కీలక ప్రాంతాల్లోని పలు ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు ఫైర్‌ఎన్వోసీల కోసం ఉన్నతాధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు అధికారులు గుర్తించారు. మెహిదీపట్నంలో ప్రియాంక ఇంటర్మీడియట్ కాలేజీ, విద్యానగర్?లోని మదర్స్ గర్ల్స్, చాంద్రాయణగుట్టలోని శ్రీచంద్ర, చిక్కడపల్లిలోని న్యూ ఎరా, శివరాంపల్లిలోని షాహీన్, తెల్లాపూర్‌లోని వశిష్ట, బర్కత్?పురాలోని హైందవి, ఎస్ఆర్‌నగర్‌లోని రెజోనెన్స్ కాలేజీలు ఉన్నతాధికారుల ఫోర్జరీ సంతకాలతోనే నకిలీ ఎన్?వోసీలను ఇంటర్ బోర్డుకు పంపించినట్లు అధికారులు గుర్తించారు.
జీహెచ్ఎంసీ కమిషనర్ సంతకమూ ఫోర్జరీ
అగ్నిమాపక నిరభ్యంతర ధ్రువపత్రాల కోసం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు కీలక అధికారుల సంతకాలను కాలేజీ యాజమాన్యాలు ఫోర్జరీకి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. గతంలో అగ్నిమాపక శాఖలో పనిచేసి బదిలీ అయిన ఉన్నతాధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ సంతకాలు ఫోర్జరీ జరిగినట్లు గుర్తించారు. అయితే ఈ వ్యవహారంలో సూత్రదారులెవరు పాత్రదారులెవరు అనే కోణంలో పోలీసులు



మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.
ఓ కాలేజీ ఎన్వోసీపై అనుమానంతో
ప్రతి విద్యాసంవత్సరంలో ఆయా కళాశాలలు తప్పనిసరిగా హైడ్రాకు ఎన్ఓసీలను సమర్పించాల్సి ఉంటుంది. అయితే 2025–2026 విద్యాసంవత్సరానికి సంబంధించి కూడా కళాశాలల యాజమాన్యాలు హైడ్రాకు ఎన్ఓసీలను సమర్పించారు. వీటి కాలపరిమితి ముగియడంతో తాజాగా ఓ కళాశాల యాజమాన్యం సమర్పించిన ఎన్వోసీపై అనుమానాలు వ్యక్తం కావడంతో హైడ్రా అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించగా పత్రాల్లోని సంతకాలు ఫోర్జరీ అయినట్టు బయటపడింది.

**బోర్డులోని అధికారులు కుమ్మక్కు**
ఉన్నతాధికారుల సంతకాల ఫోర్జరీకి పాల్పడిన కళాశాలల గుర్తింపు కూడా రద్దు చేయాలని హైడ్రా అధికారులు ఇంటర్‌బోర్డును కోరారు. అయితే కొందరు ఇంటర్‌బోర్డులోని అధికారులు కూడా ఈ వ్యవహారంలో కుమ్మక్కైనట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. మొత్తంగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. దర్యాప్తులో ఎటువంటి విషయాలు వెలుగు చూస్తాయో వేచి చూడాల్సి ఉంది.



# కొత్తగా సెంటు భూమి నిషేధిత జాబితాలో చేర్చ లేదు

## ● ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగనివ్వం
## ● 22ఏ నిషేధిత భూములపై మంత్రి పొంగులేటి సమీక్ష

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణ రాష్ట్రంలో 22ఏ భూముల పేరిట ఏ ఒక్క అర్హుడికీ అన్యాయం జరగదని, కొత్తగా ఒక్క సెంటు భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆలోచనను అర్థం చేసుకొని అదే స్ఫూర్తితో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన వారి హక్కులను కాపాడుతూనే ప్రభుత్వ భూములను పరిరక్షించాలని స్పష్టం చేశారు. 22ఏ దరఖాస్తులు, ఫిర్యాదులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్లకు మంత్రి పొంగులేటి దిశానిర్దేశం చేశారు.

**22ఏ నిషేధిత భూముల అంశంపై సమీక్ష :**
రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూములపై తరచూ వస్తున్న విమర్శలు, ఆరోపణలు, హైకోర్టు ఆదేశాలు, ప్రభుత్వ విధానాలు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి సచివాలయంలోని తన కార్యాలయంలో క్యూర్ పరిధిలోని 22ఏ నిషేధిత భూములకు సంబంధించి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో ఏ పేదవాడికీ, ఏ నిజమైన భూహక్కుదారుడికీ అన్యాయం జరగకుండా చూడటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. అర్హులైన వారి హక్కులతోపాటు ప్రభుత్వ భూములను రక్షించడం అనే రెండు లక్ష్యాలతో సర్కారు పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి నాయకత్వంలో




అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్దేశపూర్వకంగా ఒక్క సెంటు భూమిని కూడా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చలేదని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలనే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి ఎన్నడూ లేదని, వివాదాలు లేని ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఖండించారు.
అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలి
ఈ సమావేశం క్యూర్ పరిధి జిల్లాలకు సంబంధించినదైనా, ఇందులో ఇచ్చిన ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ అధికారులు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం ఇచ్చారు. 22ఏ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలు అనుగుణంగా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని అధికారులు పూర్తిగా అర్థం చేసుకుని అదే స్ఫూర్తితో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన వ్యక్తికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. అదే సమయంలో ప్రభుత్వ భూములు కాపాడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత అని అన్నారు.నిషేధిత జాబితాలో ఉన్న భూములను సమగ్రంగా పరిశీలించి, చట్టబద్ధంగా, నిబంధనల మేరకు అర్హత ఉన్న భూములను గుర్తిస్తూ, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కేసును వాస్తవాలు, రికార్డులు, చట్టపరమైన అంశాల ఆధారంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు. 22ఏకు సంబంధించిన దరఖాస్తులు, ఫిర్యాదులు ఏ స్థాయిలో వచ్చినా పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని మంత్రి స్పష్టం చేశారు. తహసీల్దార్, ఆర్డీవో, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ స్థాయిలో వచ్చే ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చేయాలని సూచించారు.

# మళ్లీ రగిలిన కావేరి చిచ్చు

**● తమిళనాడు, కర్ణాటక సరిహద్దుల్లో నీటి వివాదం**
**● బ్రిటీష్ వారి కాలంలోనే మొదలైన శాశ్వత పరిష్కారం లేదా?**

**టీ మీడియా ,ఆగస్టు 5 ,చెన్నై :**
ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన అంశం ఉదయ్‌నిధి స్టాలిన్, నటి త్రిషపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు, ఆయన అరెస్ట్. అయితే ఈ పరిణామాల వెనుక ఉన్న అసలు అంశం 'కావేరి జలాల వివాదం'. అసలు ఏంటి ఈ నీటి పంచాయితీ? దశాబ్దాలుగా కర్ణాటక, తమిళనాడు మధ్య కొనసాగుతున్న ఈ నీటి యుద్ధం ఎందుకు ఏటా మళ్లీ మళ్లీ రగులుకుంటోంది? ఈ వివాదం ఎక్కడ మొదలైంది కోర్టులు, ట్రిబ్యునళ్లు ఎన్నో తీర్పులు ఇచ్చినా ఎందుకు శాశ్వత పరిష్కారం కనిపించడం లేదు? రైతులకు జీవనాధారమైన 'కావేరి' రాజకీయాల్లో మాత్రం ఎందుకు శాశ్వత సంక్షోభంగా మారింది

**దక్షిణ గంగ– శాశ్వత వివాదం**
దక్షిణ భారతదేశంలో అత్యంత పవిత్రమైన నదిగా, దక్షిణ గంగగా పూజలు అందుకుంటోంది కావేరి నది. ఇది కర్ణాటక, తమిళనాడు మధ్య దశాబ్దాలుగా రాజకీయ, సామాజిక, భావోద్వేగ ఘర్షణకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. అయితే కావేరి నీటి పంపకాల వివాదం కేవలం కర్ణాటక, తమిళనాడు మధ్య మాత్రమే కాదు, కేరళ, పుదుచ్చేరి కూడా ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావం, తక్కువ వర్షపాతం, బలహీన రుతు పవనాలు వంటి కారణాలతో జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిన ప్రతిసారీ, కావేరి వివాదం మళ్లీ భగ్గుమంటుంది.



ట్రైబ్యునల్ పంపకాలు, సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా, కావేరి వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పని చేస్తున్నా, సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదు. దీని పూర్వాపరాలు తెలుసుకోవాలంటే, గత వందేళ్ల చరిత్రను తెలుసుకోవాల్సిందే!

**బ్రిటీష్ కాలంలోనే మొదలైన వివాదం**
బ్రిటీష్ పాలనా కాలంలోనే కావేరి వివాదం మూలాలు ఉన్నాయి. 1892లో, తరువాత 1924లో అప్పటి మైసూర్ సంస్థానం, మద్రాస్ ప్రెసిడెన్సీ మధ్య రెండు కీలక ఒప్పందాలు జరిగాయి. దాని ప్రకారం దిగువన ఉన్న మద్రాస్ ప్రెసిడెన్సీ సాగునీటి అవసరాలకు ప్రాధాన్యం లభించిందని, ఎగువున ఉన్న మైసూర్ అభివృద్ధికి పరిమితులు విధించారని కర్ణాటక వాదిస్తోంది. 1956లో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ తర్వాత ఈ వివాదం కొత్త రూపం దాల్చింది. 1974లో 1924 ఒప్పందం గడువు ముగిసిన తర్వాత, కర్ణాటక "నది మా రాష్ట్రంలో పుడుతోంది. ముందుగా మా అవసరాలు తీర్చుకోవడం సహజ హక్కు" అని వాదించడం మొదలుపెట్టింది. ఇదే సమయంలో "శతాబ్దకాలంగా కావేరిపైనే ఆధారపడిన డెల్టా వ్యవసాయం నీరు లేక నాశనం అవుతుంది" అంటూ తమిళనాడు అంటోంది.

**ట్రైబ్యునల్, కోర్టులు ఏమన్నాయి?**
కావేరీ నదీజలాల వివాదాన్ని పరిష్కారించడం కోసం 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరి జల వివాద ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. దాదాపు 17 ఏళ్ల విచారణ అనంతరం 2007లో ట్రిబ్యునల్ తుది అవార్డు ప్రకటించింది. అయితే దీనిపై ఇరు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కేసు సుప్రీంకోర్టుకు చేరింది. 2018లో సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు వెలువరించింది. అంతర్రాష్ట్ర నదులు ఏ ఒక్క రాష్ట్రానికీ చెందినవి కావని, అవి జాతీయ వనరులని స్పష్టం చేసింది. అదే సమయంలో బెంగళూరు నగర తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని కర్ణాటకకు 284.75 టీఎంసీ, తమిళనాడుకు 404.25 టీఎంసీ, కేరళకు 30 టీఎంసీ, పుదుచ్చేరికి 7 టీఎంసీ నీటికి కేటాయించింది.

# కేంద్రమంత్రి భూపేంద్ర యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ



**● పర్యావరణ అనుమతుల కోసం వినతి**

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలోని పలు సాగునీటి ప్రాజెక్టులు, రహదారులకు శాఖాపరమైన అనుమతులపై పర్యావరణ అనుమతులు, ఇతర అంశాలపై చర్చించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీలో కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్?తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. కుమురం భీం ఆసిఫాబాద్? జిల్లాలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ఎత్తు పెంపునకు మహారాష్ట్రతో చర్చలకు జోక్యం చేసుకోవాలని కేంద్ర మంత్రిని కోరారు.

**ముంపు ఎక్కువగా ఉండదు**
148 మీటర్ల ఎత్తు నిర్మాణానికి గతంలోనే మహారాష్ట్ర అంగీకరించిన విషయాన్ని గుర్తుచేశారు. 150 మీటర్ల ఎత్తుతో డ్యాం నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలని ఒకవేళ 150 మీటర్లకు ఎత్తు పెంచినా ముంపు ప్రాంతం కేవలం 1000 హెక్టార్ల లోపే ఉంటుందని సీఆర్ పాటిల్‌కు సీఎం వివరించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మాణంతో ఎత్తిపోతల ఖర్చు లేకుండా ప్రాణహిత నది నీటిని గ్రావిటీతో సాగు, తాగుకు అందించే అవకాశం ఉంటుందని విజ్ఞప్తి చేశారు.

**పర్యావరణ అనుమతులు ఇవ్వండి**
అంతకు ముందు గౌరవెల్లి, సీతారామ ఎత్తిపోతలు, డిండి, పాలమూరు–రంగారెడ్డి తదితర ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులపై కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేందర్ యాదవ్?ను కలిసి చర్చించారు. త్వరగా అనుమతులు ఇవ్వాలని సీఎం కోరారు. ఈ చర్చల్లో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పలువురు ఎంపీలు, సెక్రటరీ శ్రీధర్ సహా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఏఐసీసీ అగ్రనేతల వద్దకు**
అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం రేవంత్ భేటీ కానున్నారు. ఆ తర్వాత సీఎం రేవంత్? ఏఐసీసీ అగ్రనేతలను కలిసే అవకాశాలున్నట్లు తెలిసింది. నియోజకవర్గాల పునర్విభజన, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉంది.

# హైకోర్టు సీజే జస్టిస్ లిసా గిల్‌తో బార్ కౌన్సిల్ సభ్యుల భేటీ



**● సమస్యలపై వినతిపత్రం**

**టి మీడియా , ఆగస్టు 5 , అమరావతి బ్యూరో :**
రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు కొత్తగా ఎన్నికైన సభ్యులు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ లిసా గిల్‌ను మంగళవారం హైకోర్టులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కోర్టుల్లో ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను వారు సీజే దృష్టికి తీసుకువెళ్లారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రధాన న్యాయమూర్తికి ఓ వినతిపత్రం కూడా అందజేశారు. ముఖ్యంగా దిగువ కోర్టుల్లో సంతాప సభల నిర్వహణ సమయం మార్పు, మహిళా న్యాయవాదుల మౌలిక వసతుల లేమి తదితర అంశాలను వారు సీజే వద్ద ప్రధానంగా ప్రస్తావించారు.

**ఆ సర్కులర్ ఉపసంహరించండి**
బార్ కౌన్సిల్ సభ్యులు ప్రధానంగా సంతాప సభల అంశాన్ని సీజేకు వివరించారు. సహచర న్యాయవాదులు ఎవరైనా కన్నుమూసినప్పుడు, దిగువ కోర్టులలో వారికి నివాళులు అర్పిస్తూ సంతాప సభలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతంలో ఈ సంతాప సభలను ఉదయం పూటనే నిర్వహించేవారు. అయితే, ఈ సమయాన్ని మారుస్తూ గతేడాది జులైలో హైకోర్టు రిజిస్ట్రీ ఒక సర్క్యులర్ జారీ చేసింది.
ఆ సర్క్యులర్ ప్రకారం, సంతాప సభలను ఉదయం కాకుండా కోర్టు ముగిసే సమయంలో సాయంత్రం 4.15 గంటలకు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వల్ల న్యాయవాదులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గతేడాది ఇచ్చిన ఆ సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని సీజేను అభ్యర్థించారు. పాత విధానంలోలాగే ఉదయమే సంతాప సభలు నిర్వహించుకునేందుకు తిరిగి అనుమతి ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

**సానుకూలంగా స్పందించిన సీజే**
బార్ కౌన్సిల్ సభ్యుల విజ్ఞప్తిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ సానుకూలంగా స్పందించారు. న్యాయవాదుల మనోభావాలను అర్థం చేసుకున్న ఆమె, ఈ సమస్యకు ఒక ప్రత్యామ్నాయాన్ని సూచించారు. ఉదయం కోర్టు పని వేళలు మొదలుకావడానికి ముందే ఈ సంస్మరణ సభలను ఏర్పాటు చేసుకునే అంశాన్ని పరిశీలించాలని ఆమె సభ్యులకు సూచించారు. దీని ద్వారా కోర్టు విధులకు ఆటంకం కలగకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

**మహిళా న్యాయవాదుల అవస్థలు**
మరోవైపు మహిళా న్యాయవాదులు కోర్టు ఆవరణల్లో పడుతున్న ఇబ్బందులను సైతం బార్ కౌన్సిల్ సభ్యులు సీజే దృష్టికి తీసుకెళ్లారు. వృత్తిపరంగా మహిళా న్యాయవాదుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, వారికి తగిన కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా న్యాయవాదుల కోసం అన్ని కోర్టుల్లో తప్పనిసరిగా ప్రత్యేకంగా వేచి ఉండే గదులు (వెయిటింగ్ రూమ్స్), అలాగే పరిశుభ్రమైన మరుగుదొడ్లు (వాష్ రూమ్స్) ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని వారు సీజేను కోరారు.
హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని కలిసిన వారిలో రాష్ట్ర బార్ కౌన్సిల్ నూతన సభ్యులు చలసాని అజయ్‌కుమార్, కలిగినీడి చిదంబరం, ఆలూరు రామిరెడ్డి, గొర్రెముచ్చు శాంతకుమార్, వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, యలమంజుల బాలాజీ, బీవీ కృష్ణారెడ్డి, ఉప్పలపాటి శ్రీనివాసరాజు, సుంకర రాజేంద్రప్రసాద్, కొమ్మసాని శ్రీనివాసులరెడ్డి, ఎన్వీ సుమంత్, బెల్లాన రవి, బండారు వెంకటరమణ మూర్తి తదితరులు ఉన్నారు. వీరితో పాటు గంటా రామారావు, కీర్తి రామజోగేశ్వరరావు, వెంకటరామిరెడ్డి కొవ్వూరి, రోళ్ల మాధవి, ఎస్ కృష్ణమోహన్, అంకయ్య సత్తు, జంపని శ్రీదేవి, దొని మంజులత, కె.దుర్గ నాగశ్రీ, రాగి గంగా భవాని తదితర సభ్యులు కూడా ఈ బృందంలో ఉండి సీజేకు వినతిపత్రం సమర్పించారు.


# సమస్యల పరిష్కారానికి కృషి



**● డీసీసీ అధ్యక్షుడు ఏ. సంజీవ్ ముదిరాజ్**

**టి మీడియా , ఆగస్టు 5 , మహబూబ్‌నగర్ :**
మహబూబ్‌నగర్ పట్టణంలోని 16వ డివిజన్ పరిధిలోని బోయపల్లి, మహమ్మద్‌ఖాన్‌పల్లి తండాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించేందుకు డీసీసీ అధ్యక్షుడు ఏ. సంజీవ్ ముదిరాజ్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలకు, స్థానిక నాయకులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మీరాబాయి, శీను నాయక్, తండా పెద్దలు వి. గోపాల్ నాయక్, వీరుక్యా నాయక్, వి. లక్ష్మణ్, కే. రవి, వి. కాంత్ కుమార్, కే. రాజేష్, కే. హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం



**● కాలి బూడిదైన ఫైళ్లు**

**టి మీడియా , ఆగస్టు 5 , మధిర :**
ఖమ్మం జిల్లా మధిర యూనియన్ బ్యాంక్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఒక్కసారిగా బ్యాంకు నుంచి పొగలు రావడంతో స్థానికులు భయాందోళన చెందారు. షార్ట్ సర్క్యూట్‌తో ఫైర్ యాక్సిడెంట్ జరిగినట్లు ప్రాథమిక సమాచారం. వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొని వచ్చారు.
యూనియన్ బ్యాంక్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో బ్యాంకులో ఉన్న ఏసీలతో పాటు సీలింగ్ కాలిపోయింది. కంప్యూటర్లు, క్యాష్ కౌంటర్లు , ఫైల్స్ కూడా కొన్ని అగ్నికి ఆహుతి అయ్యాయి. స్ట్రాంగ్ రూమ్ భద్రంగానే ఉన్నట్లు సిబ్బంది వెల్లడించారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇదే బ్యాంకు బ్రాంచ్‌లో గతంలో కూడా అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం బ్యాంకు పనివేళల్లో కాకుండా ఉదయం బ్యాంక్ తెరవకముందే జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సిబ్బంది వచ్చేలోపు కొన్ని ఫైల్స్ దగ్ధం అయ్యాయి. అయితే క్యాష్ కౌంటర్లు, నగదు , స్ట్రాంగ్ రూమ్స్ సేఫ్ గానే ఉండటం తో ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాద ఘటనతో ఖాతాదారులు ఆందోళన చెందారు. బ్యాంకులో ఫైర్ సేఫ్టీ, భద్రత ఉండాలని స్థానికులు కోరుతున్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఈ ఘటన పై వివరాలు సేకరించి, విచారణ చేస్తున్నారు.

# 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

**● రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు గుర్తింపు**

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
పంటల దిగుబడికి ఎరువుల అవసరం రైతన్నలకు ఎంతో ఉంటుంది. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎరువుల కొరత లేకుండా చూసుకుంటుంది. ఈ ఏడాది ఖరీఫ్? సాగు కీలకదశకు చేరుకుంటున్నందున ఎరువుల కొరతపై ప్రభుత్వం అధ్యయనం చేసింది. విజిలెన్స్?, ఎన్?ఫోర్స్?మెంట్? బృందాలు కొద్దిరోజుల క్రితం క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. రైతులకు ఎరువుల కోసం ఓ యాప్?ను రూపొందించారు. దాని వినియోగంపై కూడా పరిశీలించారు. అందులో పలు లోపాల్ని గుర్తించి పంపించాయి. అలాగే దీనిపై కీలక సిఫార్సులు చేశాయి.



రాష్ట్రవ్యాప్తంగా విజిలెన్స్ బృందాలు 8 జిల్లాల్లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాయి. ఆ తనిఖీల్లో రూ. 1.34 కోట్ల విలువైన ఎరువుల్ని దారి మళ్లించినట్లు తేలింది. స్టాక్? రిజిస్టర్లతో పోల్చి చూడటంతో ఈ విషయం బయటపడింది.

**తనిఖీల్లో వెలుగుచూసిన లోపాలు ఇవే!**
వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీల్లో 17.9 టన్నుల పొటాష్ దారి మళ్లినట్టు గుర్తించారు. మేడ్చల్? విజిలెన్స్? యూనిట్? తనిఖీల్లో 4.75 టన్నుల ఎరువులతోపాటు 71.8 లీటర్ల క్రిమిసంహార మందుల్ని అక్రమంగా నిల్వ ఉంచినట్లు బయటపడింది. దీంతో సంబంధిత డీలర్లపై రెండు 6ఎ కేసులతో పాటు క్రిమినల్? కేసు నమోదు చేశారు.
రామచంద్రాపురం యూనిట్ బృందాల పరిశీలనలో 14.53 టన్నుల యూరియా మాయమైనట్లు తేలింది. అలాగే హైదరాబాద్ సిటీ–2 యూనిట్ తనిఖీల్లో 2.25 టన్నుల నకిలీ డీఏపీని గుర్తించారు. సంబంధిత వ్యక్తులపై 3 కేసుల్ని నమోదు చేయించింది.

**విజిలెన్స్ సిఫార్సులు ఇలా**
ప్రస్తుతం యాప్‌లో ఉన్న ప్రధాన లోపం కౌలు రైతులు ఎరువుల బుకింగ్ కోసం భూయజమాని సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీపైనే ఆధారపడుతున్నారు. దీని ద్వారా డీలర్లతోపాటు మరికొంతమంది అక్రమాలకు పాల్పడుతున్నారు. ఒకవేళ భూయజమాని అనుమతినిస్తే నిర్దిష్ట కాలానికి కౌలు రైతును అధీకృత ఎరువుల గ్రహీతగా నామినేట్ చేసే అవకాశాన్ని ఇవ్వొచ్చు. ఈ–పోస్ యంత్రం ద్వారా నామినీ తన గుర్తింపును ధ్రువీకరించుకొనేందుకు అనుమతించాలి.
ఎరువుల యాప్?కు అలాగే బయోమెట్రిక్ ప్రామాణీకరణ కోసం ఉపయోగించే ఈ–పోస్ యంత్రం మధ్య అనుసంధానం లేదు. దాంతో ఎరువుల యాప్?ను ఈ–పోస్? పరికరాన్ని రియల్‌టైం రీకన్సీలియేషన్‌తో ఒకే బ్యాకెండ్‌లో అనుసంధానించాలి. ఎరువుల బుకింగ్?, పంపిణీ రెండింటిలో లబ్ధిదారు బయోమెట్రిక్? తప్పనిసరి చేయాలి.
ప్రస్తుతం ఉన్న యాప్‌తో పాటు ఐవీఆర్ఎస్ విధానాన్ని తీసుకుని రావాలి. డయల్–ఇన్, వాయిస్–గైడెడ్ మెనూ ద్వారా సులభంగా బుకింగ్‌ను అనుమతించేలా ఈ ప్రక్రియను రూపొందించాలి. దీనివల్ల బుకింగ్ కోసం లబ్ధిదారు డీలర్లపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చు.

# దూప్‌సింగ్ తండాలో నెరవేరిన పుష్కరాల కల

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
మెదక్ నియోజకవర్గంలోని దూప్‌సింగ్ తండా ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రధాన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు చొరవతో రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆధునిక వంతెన ప్రజలకు అందుబాటులోకి రావడంతో గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎన్నో ఏళ్లుగా ప్రతి వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితికి ఇక శాశ్వతంగా తెరపడింది.
ప్రతి వర్షాకాలంలో వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించడంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోవడం, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించలేకపోవడం, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు గ్రామానికి చేరుకోలేకపోవడం, గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం వంటి సమస్యలు గ్రామ ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేసేవి. ప్రాణాలను పణంగా పెట్టి వరద నీటిని దాటి ప్రయాణించాల్సిన పరిస్థితులు ఎన్నోసార్లు నెలకొనేవి.

**ప్రత్యేక చొరవతో సమస్యకు శాశ్వత పరిష్కారం**
గ్రామస్థులు పలుమార్లు తమ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం దొరకలేదు. ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు వెంటనే స్పందించి సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజల భద్రతను అత్యంత ప్రాధాన్యంగా భావిస్తూ రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయించి వంతెన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు నాణ్యతతో, వేగంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షిస్తూ అధికారులకు తగిన సూచనలు అందించడంతో తక్కువ వ్యవధిలోనే వంతెన నిర్మాణం విజయవంతంగా పూర్తయింది.

**రోహిత్‌రావు కృషితో దూప్‌సింగ్ తండా ప్రజలకు భారీ ఊరట**
నూతన వంతెన ప్రారంభంతో దూప్‌సింగ్ తండాతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు కూడా భారీ ఊరట లభించింది. ఇకపై వర్షాకాలంలో రాకపోకలకు ఎలాంటి అంతరాయం ఉండదని, విద్యార్థులు సకాలంలో విద్యాసంస్థలకు చేరుకోవచ్చని, రైతులు తమ పంటలను ఎలాంటి ఆటంకాలు లేకుండా మార్కెట్లకు తరలించవచ్చని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, అగ్నిమాపక వాహనాలు, ఇతర ప్రభుత్వ సేవలు కూడా వేగంగా గ్రామానికి చేరుకునే అవకాశం కలిగిందని వారు తెలిపారు.

**సేవలకు గ్రామస్థుల ఘన సన్మానం**
మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు గ్రామ పర్యటన సందర్భంగా దూప్‌సింగ్ తండా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ పెద్దలు మాట్లాడుతూ, "ఎన్నో ఏళ్లుగా మా సమస్యను ఎవరూ పట్టించుకోలేదు. కానీ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు గారు మా బాధను తన బాధగా భావించి వెంటనే స్పందించారు. నేడు మా గ్రామానికి శాశ్వత పరిష్కారం లభించింది. ఈ సేవను మా గ్రామ ప్రజలు ఎప్పటికీ మరువరు" అని భావోద్వేగంగా పేర్కొన్నారు.
మహిళలు మాట్లాడుతూ, వర్షాకాలంలో పిల్లలను పాఠశాలకు పంపడంపై ఉండే భయం పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు. రైతులు మాట్లాడుతూ, పంటల రవాణా సులభతరం కావడంతో సమయం, ఖర్చు రెండూ గణనీయంగా ఆదా అవుతాయని హర్షం వ్యక్తం చేశారు.

**ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా**
వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచే నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలపై ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని గ్రామస్థులు కొనియాడారు. ఎక్కడ ప్రజలకు ఇబ్బందులు ఎదురైనా వెంటనే అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరిస్తున్నారని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న నాయకుడిగా ఆయనపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడిందని అభిప్రాయపడ్డారు.
దూప్‌సింగ్ తండా వంతెన నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి ప్రాజెక్టు మాత్రమే కాదు, గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల కష్టాలకు ముగింపు పలికిన ప్రజాహిత కార్యక్రమంగా నిలిచిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ వంతెనతో గ్రామ ఆర్థిక,

# అత్యవసర సేవలకు '100' కాదు - '112' నొక్కాలి



**● ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్**

**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో అన్ని అత్యవసర సేవల కోసం రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్? డయల్? 112 సేవలను అధికారికంగా ప్రారంభించారు. 100 పోలీస్?, 101 అగ్నిమాపక, 108 వైద్య సేవలను ఒకే గొడుగు కింద 112 ద్వారా అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 112కు బాధితులు ఫోన్ చేయగా వారి పరిష్కారానికి సిబ్బంది మానిటరింగ్ చేస్తోంది.
అత్యవసర సమయాల్లో, ఆపద కాలంలో అండగా ఉండేందుకు 112 సేవలను, ఏఐ ఆధారిత కాల్ సిస్టమ్‌ని అందుబాటులోకి తీసుకొచ్చారు. గతంలో 3–4 నిమిషాల్లో స్పందించగా ఇవాళ్టి నుంచి 2 నిమిషాల్లోనే రియల్ టైమ్ రెస్పాన్స్ ఇస్తుంది. ఈ కార్యక్రమంలో డీజీలు విక్రమ్ సింగ్ మాన్, శ్రీనివాస్, కమల్ హాసన్ రెడ్డి, సీపి రమేష్ రెడ్డి, సుమతి, సజ్జనార్, జాయింట్ సీపీ గజరావ్ భోపాల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ సికా గోయల్, సీఐడీ చీఫ్ చారు సిన్హా పాల్గొన్నారు.
112 కాల్‌తో మొత్తం 18 సేవలు
112కు సంబంధించి విజయవంతంగా పరీక్షలన్నీ పూర్తి చేసి ఇవాళ ప్రారంభించారు. పోలీస్, మెడికల్, ఫైర్, విమెన్ సమస్యలు, హైడ్రా కోసం 112 లో యాడ్? చేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్, డిజాస్టర్ మేనేజ్మెంట్, ఎలక్ట్రిసిటీ, జీహెచ్ఎంసీ లాంటి 18 సేవలు 112కు డయల్ చేస్తే ఫాల్ అప్? చేస్తున్నారు. ప్రజల్లో అవగాహన కల్పించి, సకాలంలో సేవలు అందేలా పోలీసులు చూస్తున్నారు. అంతేకాదు ఎన్ఆర్ఐ డెస్క్ కూడా అందుబాటులోకి తెచ్చి వారి సమస్యలు 112కు కాల్ చేస్తే పరిష్కరించేలా చర్యలు చేపట్టారు.
112కి ఓ కాలర్ లైవ్ కాల్ చేసి గొడవలు అల్లర్లు జరుగుతున్నాయని చెప్పగా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు ఫాల్ అప్ చేశారు. సకాలంలో స్పందించినందుకు కాలర్? హర్షం వ్యక్తం చేశారు.
కృత్రిమ మేధ ఆధారిత 112 సేవలు
ప్రస్తుత టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధ ఆధారిత 112 సేవలు అందుబాటులో తెచ్చింది. 100,112కు కాల్? చేసిన వెంటనే ఆపరేటర్? కాల్? లిఫ్ట్? చేసి లైవ్? లోనే వెంటనే స్పందించి సంబంధిత శాఖలకు బదిలీ చేస్తున్నారు. దేశంలోనే తొలిసారి ఏఐ, మానవ వనరుల ఆధారిత 112 సేవలు రాష్ట్రం ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చారు.
అనేక సమస్యలకు డయల్ 112 పరిష్కారం
కమాండ్ కంట్రోల్ సెంటర్ టవర్? బీలో రెండు ఫ్లోర్లను డయల్? 112కి కేటాయించామని సీవీ ఆనంద్ తెలిపారు. డయల్? 100ను 2013లో కొంపల్లిలో జీవీకే వారి సాయంతో ప్రారంభించారు. వివిధ అత్యవసరాలకు ఒకే నంబర్ ఉండాలని గతంలో కేంద్రం సూచించింది. దీంతో తెలంగాణ ఏర్పడిన తర్వాత టెక్నికల్ డెవలప్‌మెంట్ చేస్తూ రావడంతో ఏఐ వచ్చాక అనేక పనులు సులువుగా మారాయని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. న్యాయ, వైద్య, సైబర్ సాయం అనేక సమస్య పరిష్కారాలకు డయల్ 112 పరిష్కార మార్గం అయింది.
అంతేకాకుండా డయల్ 112 కాల్ రాగానే కాలర్ లొకేషన్ కోసం అడ్వాన్స్ టూల్స్ వాడుతున్నట్లు తెలిపారు. డ్రోన్? బెస్డ్? టెక్నికల్? సిస్టాన్ని త్వరలోనే తెలంగాణ పోలీసులు ఉపయోగించనున్నట్లు అన్నారు. అలాగే డ్రోన్? టీమ్‌ని సైతం ఫామ్ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

## వేణుకుమార్‌కు మరోసారి మాజీ ఎంపీ నామ అండ



▶▶| డిశ్చార్జ్ బిల్లు మాఫీ చేయించిన మాజీ ఎంపీ నామ

**టీ మీడియా,ఆగస్టు5,ముదిగొండ:**
గ్రూప్స్ నోటిఫికేషన్ల విడుదలలో జాప్యంపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముదిగొండ మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి. వేణుకుమార్ సోమవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ లోక్ సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఆస్పత్రి యాజమాన్యంతో నేరుగా మాట్లాడి వేణుకుమార్ డిశ్చార్జ్ బిల్లును మాఫీ చేయించారు. ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రికి చేరిన వేణుకుమార్‌కు సకాలంలో వైద్య సేవలు అందించిన డాక్టర్ కేసోజు భారత్ బాబు, ఆస్పత్రి వైద్య బృందం, నర్సింగ్ సిబ్బందిని నామ అభినందించారు. ఇప్పటికే నామ ట్రస్ట్ తరఫున వేణుకుమార్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన నామ వారి కుటుంబంపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. వేణుకుమార్ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆస్పత్రి నుంచి డిశ్చర్జ్ అయిన అనంతరం వేణుకుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ ద్వారా నామకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వేణుకుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న నామ, జీవితంలో ఇంకా ముందుకు వెళ్లాలని, సాధించాల్సింది చాలా ఉందని ధైర్యం చెప్పి భరోసా కల్పించారు. వేణుకుమార్ త్వరగా పూర్తిగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావాలని ఆకాంక్షించిన ఆయన, నిరుద్యోగ యువత ఎట్టి పరిస్థితుల్లోనూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని మరోసారి విజ్ఞప్తి చేశారు.

# నేటి నుంచి 'ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' అమలు

▶▶| ఇకపై అన్ని సబ్సిడీ ఎరువుల అమ్మకాలు ఒకే యాప్ ద్వారా


▶▶| పట్టాలు లేని రైతులు,కౌలుదారులు కూడా నాన్ డిజిటల్ సిగ్నేచర్ విధానంలో నమోదు చేసుకోవచ్చు

▶▶| ఏడీఏ కరుణశ్రీ



**టీ మీడియా,ఆగస్టు05,సింగరేణి(కారేపల్లి):**
దేశవ్యాప్తంగా సబ్సిడీ ఎరువుల క్రయ విక్రయాలను ఒకే విధానంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఫ్రేమ్ వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్' అనే నూతన యాప్‌ను అమల్లోకి తీసుకువచ్చిందని వైరా వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) తుమ్మలపల్లి కరుణశ్రీ తెలిపారు.బుధవారం కారేపల్లిలోని ఎరువుల దుకాణాలు,సహకార సంఘం విక్రయ కేంద్రాలను తనిఖీ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ,ఇప్పటివరకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ ద్వారా యూరియా అమ్మకాలు మాత్రమే జరుగుతుండగా,ఇకపై యూరియా,డీఏపీ,ఎంఓపీ,ఎన్‌పీకే కాంప్లెక్స్‌తో పాటు అన్ని రకాల సబ్సిడీ ఎరువుల విక్రయాలు ఈ యాప్ ద్వారానే జరుగుతాయని వెల్లడించారు.రైతులు తమ మొబైల్‌లో యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని ఆధార్ లేదా రైతు గుర్తింపు సంఖ్య ద్వారా లాగిన్ కావాలని సూచించారు.భూమి ఉన్నా పట్టాలు లేని రైతులు,కౌలుదారులు నాన్ డిజిటల్ సిగ్నేచర్ విధానంలో మొబైల్ నంబర్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు.యాప్‌లో పంట వివరాలు నమోదు చేసిన అనంతరం ప్రభుత్వ సూచించిన ఎరువుల సిఫార్సు విధానం ప్రకారం ఎరువుల మోతాదు సూచించబడుతుందని, అవసరమైతే రైతులు అదనపు ఎరువులను కూడా ఎంపిక చేసుకుని బుక్ చేసుకోవచ్చన్నారు. అనంతరం రూపొందే లిబుకింగ్ గుర్తింపు సంఖ్య లేదా త్వరిత స్పందన సంకేతం (క్యూ ఆర్ కోడ్)లితో సమీప ఎరువుల దుకాణానికి వెళ్లి ఎరువులు పొందవచ్చని వివరించారు.ఎరువుల డీలర్లకు ప్రత్యేక యాప్ ఉండదని,వారి అమ్మకాల యంత్రంలో రైతుల బుకింగ్ వివరాలు కనిపిస్తాయని,వాటి ఆధారంగానే ఎరువులు పంపిణీ చేయాలని చెప్పారు.ఈ కొత్త విధానంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వాలంటీర్లను నియమిస్తున్నామని,ఇప్పటికే వ్యవసాయ విస్తరణ అధికారులు,ఎరువుల డీలర్లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కారేపల్లి సహకార సంఘం చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు,డైరెక్టర్లు అడ్డగోయి ఐలయ్య,కార్యదర్శి బొల్లు హనుమంతరావు, వ్యవసాయ విస్తరణ అధికారి బీ.నరేష్,మండల అధ్యక్షుడు తోటకూరి రాంబాబు పాల్గొన్నారు.

# ఒకే యాప్ లో అన్ని ఎరువులు




**టి మీడియా, ,ఆగష్టు 5 , ఖమ్మం రూరల్:**
కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా సబ్సిడీ ఎరువుల పంపిణీని సులభతరం చేసేందుకు 'ఎఫ్ఎఫ్ఎస్ అనే కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విధానం ఆగస్టు 7, 2026 నుండి పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది.

**ఒకే యాప్‌లో**
ఇప్పటివరకు తెలంగాణ వంటి రాష్ట్రాల్లో కేవలం యూరియా కొనుగోలుకు మాత్రమే యాప్ ఉండేది. కానీ ఇకపై యూరియాతో పాటు డీఏపీ ఎంఓపీ , ఎన్‌పీకే కాంప్లెక్స్ వంటి అన్ని రకాల సబ్సిడీ ఎరువులను ఈ ఒకే యాప్ ద్వారానే విక్రయిస్తారు.

**పాత యాప్‌ల రద్దు:**
కేంద్రం తెచ్చిన ఈ కొత్త జాతీయ స్థాయి యాప్ విధానం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు గతంలో తెచ్చిన విడిగా ఉన్న యూరియా యాప్‌లు రద్దవుతాయి. యాప్ ఎలా పనిచేస్తుంది? (రైతులు చేయాల్సినవి)

**నమోదు :**
రైతులు తమ ఆధార్ నంబర్ లేదా ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్ ఉపయోగించి ఓటీపీ ద్వారా యాప్‌లోకి లాగిన్ అవ్వాలి.

**భూమి వివరాలు:**
యాప్ ప్రభుత్వ ల్యాండ్ రికార్డులతో అనుసంధానమై ఉంటుంది. అందువల్ల రైతుల పాస్‌బుక్ ఆధారంగా వారికి ఎంత భూమి ఉందో, ఎంత ఎరువు అవసరమో యాప్ ఆటోమేటిక్‌గా చూపిస్తుంది.

**ముందుస్తు బుకింగ్:**
రైతులు తమకు కావాల్సిన ఎరువులను, సమీపంలోని డీలర్‌ను ఎంచుకుని ముందుగానే యాప్‌లో బుక్ చేసుకోవచ్చు.
క్యూఆర్ కోడ్: బుకింగ్ పూర్తయిన తర్వాత రైతు మొబైల్‌కు లేదా వాట్సాప్‌కు ఒక క్యూఆర్ కోడ్ మరియు సందేశం వస్తుంది.

**ఎరువుల సేకరణ:**
ఆ క్యూఆర్ కోడ్‌ను సంబంధిత డీలర్ లేదా సహకార సంఘానికి చూపించి, రైతులు తమకు కావలసిన ఎరువులను నిర్ణీత ధరకే తీసుకోవచ్చు. ఈ విధానం వల్ల లాభాలు

**నిల్వల సమాచారం:**
ఏ డీలర్ వద్ద ఎంత ఎరువుల స్టాక్ ఉందో రైతులు యాప్‌లోనే ముందే చూసుకోవచ్చు. దీనివల్ల దుకాణాల వద్ద గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవసరం తప్పుతుంది. బ్లాక్ మార్కెటింగ్‌కు చెక్: వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మడానికి వీలుండదు. దుర్వినియోగం నివారణ: ఒకే రైతు ఐడీపై పరిమితికి మించి ఎరువులు కొని పక్కదారి పట్టించకుండా కేంద్రం యొక్క 'ఇంటిగ్రేటెడ్ ఫెర్టిలైజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా దీనిని ట్రాక్ చేస్తారు

**స్మార్ట్‌ఫోన్ లేని రైతుల పరిస్థితి ఏంటి?**
స్మార్ట్‌ఫోన్లు లేదా ఇంటర్నెట్ సదుపాయం లేని చిన్న, కారుచౌక రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎరువుల డీలర్లు లేదా అక్కడ అందుబాటులో ఉండే వ్యవసాయ అధికారులు తమ సొంత ఫోన్ల ద్వారా రైతులకు ఓటీపీ వెరిఫికేషన్ పూర్తి చేసి ఎరువులు అందేలా సహాయం చేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

# బ్రెయిన్ డెడ్‌తో యువకుడి మృతి

▶▶| అవయవదానంతో పలువురికి ప్రాణదాతగా నిలిచిన పాయం సాయి

▶▶| విషాదంలోనూ గొప్ప నిర్ణయం తీసుకున్న కుటుంబ సభ్యులు



**టీ మీడియా,ఆగస్టు05,సింగరేణి(కారేపల్లి):**
ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఎర్రబోడు గ్రామం మూలమలుపు వద్ద ఈ నెల 2న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పాయం సాయి (20) బుధవారం బ్రెయిన్ డెడ్ కావడంతో మృతి చెందాడు.విషాదంలోనూ అతని కుటుంబ సభ్యులు గొప్ప మనసుతో అవయవదానానికి అంగీకరించి పలువురికి ప్రాణదాతలుగా నిలిచారు.కారేపల్లి మండలం కోయగుంపుకు చెందిన పాయం సాయి,వజ్జా సురేష్ ద్విచక్రవాహనంపై కారేపల్లి క్రాస్ రోడ్డు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎర్రబోడు మూలమలుపు వద్ద ప్రమాదానికి గురయ్యారు.ఈ ప్రమాదంలో వజ్జా సురేష్ ఘటనాస్థలంలోనే మృతి చెందగా,పాయం సాయికి తీవ్ర గాయాలై కోమాలోకి వెళ్లాడు.అనంతరం అతడిని హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందించినప్పటికీ బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు.ఈ నేపథ్యంలో అవయవదానం ప్రాధాన్యతను సొసైటీ మాజీ చైర్మన్ నాగేశ్వరరావు కుటుంబ సభ్యులకు వివరించి అవగాహన కల్పించారు.తమ కుమారుడు అవయవదానం ద్వారా మరెందరి జీవితాల్లో వెలుగులు నింపాలని భావించిన కుటుంబ సభ్యులు వెంటనే అంగీకారం తెలిపారు.దీంతో పాయం సాయి అవయవాలను వైద్యుల పర్యవేక్షణలో సేకరించి స్టార్ ఆస్పత్రి, యశోద ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అవసరమైన రోగులకు దానం చేశారు.విషాద సమయంలోనూ సమాజానికి ఆదర్శంగా నిలిచిన పాయం సాయి కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని పలువురు అభినందిస్తూ,వారి సేవా భావాన్ని కొనియాడారు.

# డ్రగ్స్ వద్దు బ్రో ఈగల్ పల్లెబాట అవగాహన కార్యక్రమం




**టీ.మీడియా,ఆగస్టు5,చింతూరు:**
చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు బ్రో అను అవగాహన కార్యక్రమం ఐజిపి .ఆకే రవి కృష్ణ, ఎస్పీ ఆదేశాల మేరకు ఈగల్ పల్లె బాటలో భాగంగా పోలవరం జిల్లాలోని ఈగల్, తూర్పు గోదావరి జిల్లా వారి ఆధ్వర్యంలో నిర్వహించారు .ఈ సందర్భంగా విద్యార్థులకు ఆపరేషన్ చైతన్యం,ఆపరేషన్ గరుడ, ఆపరేషన్ ఈగల్ ఆన్ ట్రైన్స్, సేఫ్ క్యాంపస్ జోన్, వజ్ర ప్రహార్, ఇతర ఈగల్ వర్క్స్ గురించి వివరించారు . డ్రగ్స్ దుర్వినియోగం గురించి, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలు, శారీరక, మానసిక ఆరోగ్యంపై వచ్చే ప్రభావం, నేరచరిత్రపై పడే ప్రభావాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.గంజాయి సంబంధిత కదలికలపై ఎటువంటి సమాచారమున్నా వారిని 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారమివ్వాలని,ఇచ్చిన వారి వివరములను గోప్యంగా ఉంచుతా మన్నారు .ఈ కార్యక్రమంలో ఈగల్ పోలవరం జిల్లా ఇన్స్పెక్టర్ పివి.సూర్య మోహన్ రావు,హెచ్.సి. మధు,వీరబాబు, వెంకటేష్ లు, కళాశాల ప్రిన్సిపాల్ కె. రమేష్ బాబు,అధ్యాపకులు భరత్, గణేష్, దుర్గా ప్రసాద్,భూలక్ష్మి, అప్పల నాయుడు, సుశీల, రాము,శివ, చంద్రశేఖర్,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వేతనాలు తగ్గడం వల్ల ఔట్సోర్సింగ్ ఉద్యోగుల ఇబ్బందులు




**టీ మీడియా, ఆగస్టు 05, రామకృష్ణాపూర్:**
క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ వేతనాల సమస్యను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ గోడిశెల సంధ్యారాణిని కలిసి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైర్‌పర్సన్ సంధ్యారాణి వీలైనంత త్వరగా సిడిఎంఏ మేడంతో మాట్లాడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు పాత వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అదేవిధంగాఎట్టి పరిస్థితుల్లోనూ ఉద్యోగుల వేతనాలను పెండింగ్‌లో పెట్టవద్దని, ప్రతి నెల 1వ తేదీన కచ్చితంగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని, వారి సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చైర్‌పర్సన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు భూమా గౌడ్, మద్దెల శంకర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కాంటాక్ట్ కార్మికులు తరులు పాల్గొన్నారు.

# రైతులను తక్షణమే ఆదుకోవాలి




**టీ మీడియా, ఆగస్టు 5, దమ్మపేట :**
దమ్మపేట మండలం, వర్షాభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ ఐ యు కె ఎస్) ఆధ్వర్యంలో బుధవారం దమ్మపేట డిప్యూటీ తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఎ ఐ యు కె వం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో వర్షాలు కురుస్తాయన్న వాతావరణ నిపుణుల అంచనాలను నమ్మి రైతులు భారీగా పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేశారని తెలిపారు. అయితే, అక్కడక్కడా చిరుజల్లులు మినహా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో మొలకెత్తిన పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడి రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావంతో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించాలని, ప్రత్యామ్నాయంగా సాగు చేసుకునే స్వల్పకాలిక పంటల విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేసి, వడ్డీ లేని కొత్త పంట రుణాలు మంజూరు చేయాలని, పంట బీమాను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అలాగే గ్రామాల్లో పశుగ్రాసం, తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రాజెక్టులు, కాలువల్లోని లోపాలను సరిచేసి సాగునీటిని అత్యవసరంగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఎల్‌నీనో ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవక భూగర్భ జలాలు అడుగంటిపోయాయని, చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేక వ్యవసాయం సంక్షోభంలో పడిందని పేర్కొన్నారు. వ్యవసాయ కూలీలకు కూడా ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద 200 రోజుల పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా వ్యవసాయ కూలీలకు నెలకు రూ.7,500 జీవనభృతి అందించాలని కోరారు. ప్రభుత్వాలు వెంటనే స్పందించి రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం డివిజన్ కార్యదర్శి తోడం దుర్గమ్మ, కారం సంధ్య, అఖిల భారత ఐక్య రైతు సంఘం పాల్వంచ డివిజన్ అధ్యక్షుడు పండూరి వీరబాబు, కార్యదర్శి నకిరేకంటి నాగేశ్వరరావు, రాయబారపు వెంకటేశ్వర్లు, ఊకే అప్పారావు, కుంజ కాంతారావు, ఎర్రగొర్ల రామారావు, తమ రాముడు, కుంజ పాపారావు, గంగాధర నాగమణి, బండి ఆదినారాయణ, సోయం సీతారాములు, కాక రాజు, దొంగ లక్ష్మీనారాయణ, బాదంపరుపు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీకేంద్రంలో అన్నప్రాశన వేడుక



**టీ మీడియా ,ఆగష్టు 5 ,ఆళ్లపల్లి :** మార్కోడు స్థానిక అంగన్‌వాడీ-2 కేంద్రంలో బుధవారం పిల్లల అన్నప్రాశన వేడుకను సర్పంచ్ సుతారి రమాదేవి ఆధ్వర్యంలో చాలా కోలాహలంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న పిల్లలకు సర్పంచ్ సొంత చేతులతో తొలిసారిగా అన్నం తినిపించి ఆశీర్వదించారు. అనంతరం సర్పంచ్ సుతారి రమాదేవి మాట్లాడుతూ... పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు పోషకాహారం ఎంతో అవసరమని తెలిపారు. ఆరు నెలలు నిండిన ప్రతి చిన్నారికి తల్లి పాలతో పాటు ఉడికించిన మెత్తటి ఆహారాన్ని అందించాలని సూచించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న గుడ్లు, బలామృతం, పాలు మరియు పోషకాహారాన్ని తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు షేక్ పర్వీన్ అంగన్‌వాడీ టీచర్లు జయ, విజయ,సుభద్ర,జయచిత్ర, కోటమ్మ, శిరీష ఆయా, వార్డు సభ్యులు, చిన్నారుల తల్లులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికపై ఎదురుచూపు



**● మున్సిపాలిటీలో గడువు తీరినా జరగని ఎన్నిక**

**టీ మీడియా ఆగష్టు5 మధిర :** మున్సిపాలిటీ ఎన్నికలు ముగిసి ఆరు నెలలు కావస్తున్నా మధిర మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల నియామకంపై ఉలుకు పలుకు లేని పరిస్థితి. మున్సిపల్ ఆక్ట్ ప్రకారం ఎన్నికలు పూర్తయి పాలకవర్గం కొలువుతీరిన నెలరోజుల నుండి వంద రోజులలోపుకోఆప్షన్‌సభ్యులనియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుంది రాజ్యాంగ పరిధిలో నిర్వహించాల్సిన ఈ ప్రక్రియపై మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సంబంధిత ఆదేశాలతో నాలుగు నెలల క్రితమే నియమకాన్ని నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించడం గమనార్హం. మధిర మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియలు నిర్వహించేందుకుగానునోటిఫికేషన్‌విడుదలకుసంబంధించిఇప్పటివరకుఅధికారులుస్పందించకపోవడంపైఆశావాహులుఅసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులకు సంబంధించి కౌన్సిలర్ల తో పాటు నలుగురు కో-ఆప్షన్ సభ్యులుగా నియమించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాల్సి ఉంది. ఈ నలుగురు సభ్యులలో రెండు మైనార్టీ కేటగిరీలలో ముస్లిం క్రిస్టియన్ బుద్ధిష్టులు పార్టీలు ఇతర మైనార్టీ వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన రెండు స్థానాల్లో ఇతరులకు అనగా గతంలో సర్పంచులుగా వార్డు సభ్యులుగా కౌన్సిలర్లుగా మున్సిపల్ చైర్ పర్సన్ గా పనిచేసిన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. స్వతంత్రత కు అవకాశం ఇవ్వాల్సిన ఈ కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియలో పరోక్షంగా ప్రత్యక్షంగా అధికార పార్టీకి చెందిన వారే నామినేషన్లు దాఖలు చేసుకునే అవకాశం ఎంపిక అవకాశం ఉంటుంది.

ప్రస్తుతం మధిర మున్సిపాలిటీలో నాలుగు స్థానాలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షం టిడిపి మరో మిత్రపక్షం గా వ్యవహరించినట్లుగా కొనసాగుతున్న సిపిఐ తమకు కో ఆప్షన్ స్థానాల్లో అవకాశం ఉంటుందని ఆశిస్తుండగా, మైనార్టీ విభాగంలో రెండు స్థానాలతో పాటు మిగిలిన రెండు స్థానాల్లో కూడా కాంగ్రెస్ పార్టీ కి చెందిన వారికే అవకాశం కల్పించే దిశగా చర్చ కొనసాగుతున్నదని తెలుస్తోంది. ఇప్పటికే మధిర మునిసిపాలిటీ లో పాలకవర్గానికి సమాంతరంగా అభివృద్ధి కమిటీ పేరుతో నిర్ణయాధికారాలు కొనసాగుతున్న పరిస్థితిపై రాజకీయ పక్షాల నుండి విమర్శలు వెలువెత్తుతున్న క్రమంలో కో-ఆప్షన్ సభ్యులు ఎంపికపై ఈ ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉన్న క్రమంలో నియామక ప్రక్రియను వాయిదా వేస్తూ వస్తున్నట్లు సమాచారం. అయితే మున్సిపల్ ఎన్నికల నిబంధన నియమావళి తో పాటు రాజ్యాంగ ప్రక్రియ మేరకు తప్పనిసరిగా నిర్ణీత గడువులో కో ఆప్షన్ సభ్యుల నియామకం పూర్తి చేయాల్సి ఉన్న నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులకు ఈ అంశంపై దృష్టి సారించాలని ఆశావాహులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో పుడితే ఒక గ్రామ్ బంగారు ఉంగరం..

**● తమిళనాడు బడ్జెట్‌లో ప్రకటన**

**టి మీడియా , ఆగస్టు 5 , ఢిల్లీ బ్యూరో :** తమిళనాడు ప్రభుత్వం బుధవారం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టింది. విజయ్ టీవీకే ఆధ్వర్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ఇది. తమిళనాడు ఆర్థిక శాఖ మంత్రి ఎన్ మేరీ విల్సన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. 2036లోపు తమిళనాడు ఆర్థిక వ్యవస్థను 1.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కీలక పథకాల్ని ప్రభుత్వం ప్రకటించింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పిల్లలు పుడితే వారికి ఒక గ్రామ్ బంగారం అందించే పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుంది.

ఈ బడ్జెట్‌లోని కొన్ని కీలక అంశాలివి. 'తాయ్ మామన్ తంగా మోతిరం తిట్టం' పథకం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో జన్మించే ప్రతి బిడ్డకు 1 గ్రామ్ బంగారు ఉంగరాన్ని అందిస్తారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు ఆర్థిక సాయాన్ని పెంచనున్నారు. దీనివల్ల 1.93 లక్షల



కుటుంబాలకు ప్రతి ఏటా రూ.7,000 వరకు ఆర్థిక సాయం అందిస్తారు. ఇందుకోసం రూ.135 కోట్లు కేటాయించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు 'అన్నన్ సీర్ తిట్టమ్ అనే పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద వధువుకు 8 గ్రాముల బంగారంతోపాటు ఒక పట్టుచీరను అందిస్తారు. వెట్రి ల్యాప్‌టాప్ స్కీమ్ కింద అర్హులైన పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. రైతులకు విద్యుత్ సబ్సిడీ కింద రూ.7,432 కోట్లు కేటాయించింది. రైతులు, వ్యవసాయ రంగం సంక్షేమానికి రూ.14,984 కోట్లు కేటాయించింది. అరివగం పేరుతో దేశంలోనే మొదటి ఏఐ అండ్ ఇన్నోవేషన్ సిటీని ఏర్పాటు చేస్తారు. అలాగే, తూతుకుడి, తిరునెల్వేలి ప్రాంతాల్ని స్పేస్ ఇండస్ట్రియల్ ఇన్వెస్ట్‌మెంట్ జోన్‌గా ప్రకటించారు.

మహిళా సాధికారతలో భాగంగా స్వయం సహాయక గ్రూపులకు రూ.38,000 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ ఉద్యోగులకు అందించే హెల్త్ ఇన్సూరెన్స్ స్కీంను రూ.5 లక్షల నుంచి రూ.7.5 లక్షలకు పెంచబోతున్నారు. గరిష్టంగా రూ.12 లక్షలతో మరో హెల్త్ ఇన్సూరెన్స్ స్కీం కూడా ఉంది. 12 జిల్లాల్లో 12 వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేస్తారు. మధురైలో ప్రత్యేక లా కాలేజీని ఏర్పాటు చేస్తారు. 2027-28 విద్యాసంవత్సరం నుంచి ఇది ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో ఉన్నత విద్య కోసం రూ.8,393 కోట్లు కేటాయించారు. అలాగే, కొత్తగా ఐదు ఐటీఐలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ స్కూళ్లలో 11వ తరగతి చదివే విద్యార్థులకు హెల్మెట్, లైట్స్, వాటర్ బాటిల్స్‌తో కూడిన సైకిళ్లు అందజేస్తారు.

# మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**● ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలి: ఐఎఫ్‌టీయూ**

**టి మీడియా , ఆగస్టు 5 , పెద్దపల్లి :** ఆటో, మోటార్ రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సౌకర్యం కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఐ. కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం జిల్లా మోటార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ పరిపాలనా అధికారి (ఏఓ) ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివిధ సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఐ. కృష్ణ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన మోటార్ రంగ కార్మికుల జీవితాల్లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆశించిన మార్పులు రాలేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మోటార్ రంగ కార్మికులు లారీలు, క్యాబ్‌లు, ఆటోలు, మినీ బస్సులు, వ్యాన్లు, అంబులెన్స్‌లు, డీసీఎంలు, మ్యాజిక్ వాహనాలు తదితరాలను




నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు.వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రోడ్డు భద్రత చట్టంలోని హిట్ అండ్ రన్ నిబంధనలతో డ్రైవర్లపై తీవ్ర భారం పడుతోందని, ఆ నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా మోటార్ రంగ కార్మికులను ఐక్యం చేసి ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా మోటార్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఈ. నరేష్, ఉపాధ్యక్షుడు బి. కొమరయ్య, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రవికుమార్, జిల్లా నాయకులు ఐ. రాజేశం, తిర్రీ బాలకృష్ణ, పోగుల శేఖర్, ఎనగంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అధికారులపై సర్పంచుల ఆగ్రహం



**టి మీడియా , ఆగస్టు 5 , హైదరాబాద్ బ్యూరో :** పెద్దశంకరంపేట మండల ప్రథమ సర్వసభ్య సమావేశం మంగళవారం తీవ్ర స్థాయిలో వాడివేడిగా జరిగింది. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో గ్రామాల అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న పలు మౌలిక సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులు విస్తృతంగా చర్చించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన సర్పంచులు తమ పరిధిలోని సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

విద్యుత్ శాఖ అధికారుల తీరుపై మండిపాటు ముఖ్యంగా శివాయిపల్లి, చీలపల్లి, కమలాపూర్, ఆరేపల్లి, రామోజిపల్లి, గొట్టిముక్కుల, బూర్గుపల్లి తదితర గ్రామాల సర్పంచులు విద్యుత్ సమస్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయని, విరిగిపోయిన లేదా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో అధికారులు విపరీతమైన జాప్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండటం లేదని, ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

సమావేశంలో బుజ్రాన్పల్లి గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. గత ఏడు నెలలుగా తమ గ్రామానికి మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. సర్వసభ్య సమావేశాల ఉద్దేశం సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించడమేనని, అధికారులు ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఇదే సమావేశంలో ఇంకుడు గుంతల నిర్మాణం, జలసిరి కార్యక్రమాలు, ఘన వ్యర్థాల నిర్వహణ, చెత్త సేకరణపై అవగాహన పెంచాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జగదీష్, తహశీల్దార్ నారాయణ, ఎంపీడీవో క్రాంతి కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భారీగా గంజాయిని పట్టుకున్న కూసుమంచి పోలీసులు




**● నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు**

**టి మీడియా , ఆగస్టు 5 , కూసుమంచి :** మండలంలోని జీళ్లచెరువు గ్రామం వద్ద కూసుమంచి పోలీసులు భారీగా గంజాయి పట్టుకున్నట్లు తెలిపారు. బుధవారం వారు విడుదల చేసిన పత్రిక ప్రకటన ద్వారా వివరాలు వెల్లడించారు.పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం సాయంత్రం ఈగల్ టీమ్ పక్కా సమాచారం ప్రకారం, హైవేలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న కూసుమంచి పోలీసులు ఒడిస్సా నుండి కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న ఒక కోటి అరవై ఐదు లక్షల విలువైన 331 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హైవేలో తనిఖీ చేస్తున్న కూసుమంచి పోలీసులకు వాహనాలు ఆపకుండా వేగంగా వెళ్తున్న బొలెరో, మరోక కారు ను వెంబడించి పట్టుకోగా వారి వద్ద నుండి నిషేధత గంజాయి భారీగా పట్టుబడినట్లు తెలిపారు. కాగా పోలీసులు వారిని విచారించగా వంతల. గోపీనాథ్,ఎం.నాగరాజు, ఖిలో లక్ష్మణ్ లు రెండు వాహానాలలో తరలిస్తున్నట్లు ఒప్పుకున్నారు.

**నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలింపు:** పంచనామా నిర్వహించి వారి వద్ద నుండి గంజాయితో పాటు రెండు సెల్ ఫోన్లు రెండు వాహానాలను, ఒక మోటార్ సైకిల్, 10,000/- రుపాయాల నగదును స్వాధీన పర్చుకొని, అట్టి వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపించారు. పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతుందని పోలీసులు తెలిపారు. కాగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. 1).వంతల గోపీనాథ్ (27 ), ఉప్పరిగొట్ల గ్రామం, మారేడుమిల్లి మండలం, తూర్పు గోదావరిజిల్లా, ఆంధ్రప్రదేశ్ 2).ఎం.నాగరాజు(32) సత్నూర్, కనకపుర జిల్లా, కర్ణాటక3) ఖిలో లక్ష్మణ్, (25 ) ఉప్పరిగొట్ల గ్రామం, మారేడుమిల్లి మండలం, తూర్పు గోదావరి జిల్లా వీరిని రిమాండ్ కు తరలించారు. కాగా బురిడి సీతారాం, అలంగి లైసెన్, మనోజ్ కుమార్, శివప్ప, దొండోఏరాజు, కొర్రలోకోన్, మల్లిఖార్జున్, మన్యం కార్తీక్ కుమార్ అనే నిందితులు ఎనిమిది మంది పరారిలో ఉన్నట్టు తెలిపారు. ఈ ఆపరేషన్ లో కూసుమంచి ఎస్ఐ దివ్యశ్రీ, హెడ్ కానిస్టేబుల్ శాంసన్, శోభన్ బాబు తదితరులు పాల్గోన్నారు.

# గురుకులాల అభివృద్ధే లక్ష్యం

**● ఆర్‌సీఓగా బీఏఎల్ నారాయణ నాయక్**

**టి మీడియా , ఆగస్టు 5 , మహబూబాబాద్ :** మహబూబాబాద్ గిరిజన గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ (ఆర్‌సీఓ)గా బీఏఎల్ నారాయణ నాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఇప్పటివరకు ఆర్‌సీఓగా విధులు నిర్వహించిన రత్నకుమారి నుంచి ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్న నారాయణ నాయక్, సీనియర్ ప్రిన్సిపాల్‌గా గురుకుల సొసైటీలో అందించిన సేవలను గుర్తించిన గిరిజన గురుకులాల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి ఆయనను మహబూబాబాద్ రీజినల్ కోఆర్డినేటర్‌గా నియమించారు.




ఈ సందర్భంగా నారాయణ నాయక్ మాట్లాడుతూ, మహబూబాబాద్ జిల్లాలోని గిరిజన గురుకుల పాఠశాలలు, కళాశాలలు సమర్థవంతంగా నిర్వహించబడేలా తనవంతు కృషి చేస్తానని తెలిపారు. గతంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ (డీసీఓ)గా పనిచేసిన అనుభవంతో గురుకులాల పరిపాలన, విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు.

అధికారుల సహకారంతో జిల్లాలోని గురుకులాలను అన్ని రంగాల్లో రాష్ట్రంలో ముందువరుసలో నిలిపేందుకు కృషి చేస్తానని అన్నారు.నూతనంగా బాధ్యతలు చేపట్టిన నారాయణ నాయక్‌ను దామరంచ గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ నాయక్‌తో పాటు వివిధ గురుకుల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

